


మున్సిపల్ అధికారులపై ఏసిబికి ఫిర్యాదు

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని వెంకటేశ్వరా డీలక్స్ స్థలం వివాదంలో వుండగా మున్సిపల్ కమిషనర్, సహా రెవెన్యూ అధికారులు ఆ స్థలాన్ని మ్యుటేషన్ చేయడానికి ప్రయత్నాలు చేయడంపై ఎసిబి అధికారులకు ఫిర్యాదు చేసినట్లు జమిందార్ కుటుంబానికి చెందిన రాజా గౌరీదేవి చెప్పారు. కోర్టు వివాదంలో ఉన్న వెంకటేశ్వరా డీలక్స్ స్థలానికి సంబంధించిన అసెస్మెంట్‌ను కొనుగోలుదారుల నుంచి ముడుపులు తీసుకుని వారి పేరిట మ్యుటేషన్ చేయడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారని ఆమె ఫిర్యాదు చేశారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు ఆమె ఒక ప్రకటనలో తెలిపారు.



విద్యార్థులకు పరీక్షా కాలం మొదలైంది. ఎక్కడ చూసినా విద్యార్థులు పుస్తకాలకే పరిమితమవుతున్నారు. పది, ఇంటర్ విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవుతున్నారు. విద్యార్థులను సన్నద్ధం చేసే దిశగా ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో పది, ఇంటర్ పరీక్షల్లో ముందంజలో నిలిచే దిశగా అధికారులు కసరత్తు ప్రారంభించారు. జిల్లాలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ఈనెల 11 నుంచి జరుగుతున్నాయి. అయితే ఈ పరీక్షలు మొక్కుబడిగా జరుగుతున్నాయనే విమర్శలున్నాయి. ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు పరీక్ష కేంద్రాల్లోకి గంట ముందు మాత్రమే విద్యార్థులను అనుమతిస్తారు. ఇంటర్ ప్రాక్టికల్స్ రెండు విడతల్లో నిర్వహిస్తారు.

పరీక్షా కాలం

- మార్చి 1 నుంచి ఇంటర్,18 నుంచి పదో తరగతి పరీక్షలు
- విద్యార్థులను సన్నద్ధం చేస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- పార్వతీపురం

మొదటి విడత ప్రాక్టికల్ పరీక్షలు ఈనెల 11వ తేదీ నుంచి 15 వరకు, రెండో విడత 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరిగాయి. మార్చి 1వ తేదీ నుంచి థియరీ పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ఈ ఏడాది ఇంటర్ పరీక్షలకు 17268 మంది విద్యార్థులు రాయనున్నారు. 12 కేంద్రాల్లో పరీక్షలు జరగనునాన్నాయి. ఓపెన్ స్కూల్ పదవ తరగతి విద్యార్థులు 712 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. 493 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరు కానున్నారు. ఈ పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయి.

. టెన్త్ పరీక్షలకు కూడా అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. సుమారు 11,190 విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉండగా, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టింది. కేంద్రాల వద్ద వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచుతుంది. ఉదయం 9.30 గంటల నుంచి 12.45 గంటల వరకు పరీక్షలు జరగనుండగా, నిమిషం అలస్యమైనా అనుమతి ఇవ్వరు. సమస్యాత్మక కేంద్రాలతో పాటు సెట్టింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేయనున్నారు. వేసవి నేపథ్యంలో ప్రతి పరీక్ష కేంద్రం వద్ద వైద్యులు అందుబాటులో ఉండేటట్టు చూడాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ సూచించారు. మొబైల్ నిషేధిత ప్రాంతంగా పక్కాగా అమలు చేస్తామని తెలిపారు.

పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

మంత్రి బొత్స సత్యనారాయణ



పదోతరగతి, ఇంటర్ తదితర పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేసి, పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ ఆదేశించారు. తాడేపల్లిలోని విద్యా శాఖ కార్యాలయం నుంచి ఇంటర్మీడియట్, 10వ తరగతి, డిఎస్‌సి, టెట్ పరీక్షలపై జిల్లా కలెక్టర్‌లు, స్కూల్ ఎడ్యుకేషన్ కమీషనర్ సురేష్ కుమార్, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమీషనర్ సౌరబ్ గౌర్, విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ తో కలిసి మంత్రి బొత్స గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్నది పరీక్షల కాలమని, అధికారులంతా అప్రమత్తంగా విధులను నిర్వహించాలని ఆదేశించారు. మార్చి 1 నుంచి 20 వరకు ఇంటర్ పరీక్షలకు, మార్చి 18 నుంచి నిర్వహించే పదవ తరగతి పరీక్షల కోసం ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ నెల 27 నుంచి టెట్, మార్చి 15 నుంచి డిఎస్‌సి జరుగుతాయని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే ఈ పరీక్షలకు పకడ్బంధీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. మరోవైపు ఎన్నికల ప్రక్రియ కూడా ప్రారంభం కాబోతుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షలను సజావుగా నిర్వహించడంతో పాటు, స్పాట్ వేల్యూయే షన్‌కు కూడా కలెక్టర్లు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. వివిధ శాఖల రాష్ట్ర ఉన్నతాధికారులు మాట్లాడుతూ ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేసి పరీక్షలను తనిఖీ చేయాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి బందోబస్తు ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేయాలన్నారు. మాస్ కాపీయింగ్ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాలను సెల్ ఫోన్ ఫ్రీ జోన్ గా ప్రకటించడం జరిగిందని, సిబ్బంది కూడా సెల్‌ఫోన్‌లు ఉపయోగించరాదని స్పష్టం చేశారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకొనే విధంగా బస్సులను ఏర్పాటు చేయాలని, హాల్ టిక్కెట్ చూపిస్తే ఉచిత ప్రయాణానికి అనుమతించాలని సూచించారు. సమావేశంలో కలెక్టర్ నిశాంత కుమార్ ఇన్‌ఛార్జి డిఆర్ఒ జి.కేశవ నాయుడు, డిఎస్‌పి ఎ.మురళీధర్, డిఇఒ జి.పగడాలమ్మ, జిల్లా ప్రజా రవాణా అధికారి టివిఎస్ సుధాకర్, సహాయ పోస్టల్ సూపరింటెండెంట్ ఐమురళి, ఎఒ సూర్యనారాయణ పాల్గొన్నారు.



పార్వతీపురంలో రాస్తారోకో చేస్తున్న రైతు సంఘాల సమన్వయ కమిటీ నాయకులు

రైతు మృతికి మోడీనే కారణం

కేంద్రం తీరుపై పలుచోట్ల నిరసనలు

ప్రజాశక్తి - పార్వతీపురం

ఢిల్లీలో రైతు ఉద్యమకారుడు శుబ్ కరణ్ సింగ్ పై నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం పాల్పడిన కర్కాశ ఉన్మాదపు దాడిని ఖండిస్తూ గురువారం రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో ఢిల్లీలో జరుగుతున్న రైతు ఉద్యమానికి మద్దతుగా స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రాస్తారోకో చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌కెం సమన్వయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఢిల్లీలో రైతులు చేస్తున్న పోరాటం పట్ల మోడీ ప్రభుత్వం చాలా నిరంకుశంగా వ్యవహరిస్తుందని, గత పోరాటంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతున్న రైతుల పట్ల తీవ్రమైన దారులకు పాల్పడడం అమానుషమని మండిపడ్డారు. రైతు ఉద్యమకారుడు శుబ్ కరణ్ సింగ్‌ను మోడీ ప్రభుత్వం హత్య చేసే చర్యను ఖండిస్తున్నామని, రైతులపై కాల్పులకు కారకులైన పోలీసులను శిక్షించాలని, చనిపోయిన రైతు కుటుంబానికి నష్టపరిహారం ఇచ్చి ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ బంటు దాసు, ఎపి రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బాషా, ఎఐకెఎంఎస్ రాష్ట్ర నాయకులు బి. నరసింగరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, కోశాధికారి గొర్లి. వెంకటరమణ, ఎఐటియుసి నాయకులు జీవ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.గంగునాయుడు, జి.సత్యనారాయణ, వ్యవసాయ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.నాయుడు, ఏపీ రైతు సంఘం సహాయ కార్యదర్శి రెడ్డి.రమణమూర్తి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.సంగం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.సూరయ్య, ఐఎఫ్.టి. యు నాయకులు కుమార్, సిఐటియు నాయకులు బి. సూరిబాబు, పి. రాజశేఖర్, గిరిజన సంఘం నాయకులు పాలక రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : రైతు ఉద్యమం పట్ల ప్రధాని నరేంద్ర మోడీ నిరంకుశత్వాన్ని దేశ ప్రజలంతా ఖండించాలని రైతు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఎపి రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు మాదిరెడ్డి తిరుపతినాయుడు, బోను గౌరునాయుడు ఆధ్వర్యాన మండలంలోని కొత్తవలస నిరసన తెలిపారు. ఈ నిరసనను ద్దేశించి తౌలుత సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని, రంగాన్ని కాపాడాలని, కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బొంగు కృష్ణ, సింహాచలం, సత్యనారాయణ, చొక్కాపు సూర్యనారాయణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

కొమరాడ : ఆందోళన చేస్తున్న రైతులను పోలీసులు ద్వారా కాల్పులు జరిపించి కాల్చి చంపడం సరికాదని ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఏ ఉపేంద్ర డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రైతు శుభ్ కరణ్ సింగ్‌ను హతమార్చడం సిగ్గుచేటన్నారు. దీన్ని రైతు సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు.



వాలంటీర్లను సన్మానిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

సిఎం ఆదేశిస్తే ఎమ్‌పిగా పోటీ

వాలంటీర్ల సన్మాన కార్యక్రమంలో డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - సాలూరు

సిఎం జగన్ మోహన్‌రెడ్డి ఆదేశిస్తే తాను ఎంపీగా పోటీ చేస్తానని డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. పట్టణంలోని కోదండరామ కల్యాణమండపంలో మండలంలోని వాలంటీర్లకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. తాను ఎంపిగా చేయాలని ఉందన్న విషయాన్ని రాజన్నదొర ఇంతవరకు పలు సందర్భాల్లో చెప్పారు. కొద్దినెలల క్రితం సామాజిక సాధికారత బస్సు యాత్రకు ముందు ఆయన నివాసంలో నిర్వహించిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు వాలంటీర్ల సన్మాన కార్యక్రమంలో కూడా తన మనసులోని మాటను బయటపెట్టారు. ఆరోగ్యం బాగుండడం లేదని, జాగ్రత్తగా ఉండాలని వైద్యులు చెపుతున్నారని చెప్పారు. పిల్లల చదువులపై శ్రద్ధ వహించాలని యోచిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేగా పోటీ చేస్తే వ్యక్తిగత అంశాలపై దృష్టి సారించలేనన్నారు. అధిష్టానం దేనికి పోటీ చేయమంటే దానికే చేస్తానని చెప్పారు.

టిడిపి గెలిస్తే వాలంటీర్ వ్యవస్థ ఎత్తేయొచ్చు

రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో వైసిపి అధికారంలోకి రాకపోతే వాలంటీర్ వ్యవస్థను ఎత్తివేయొచ్చునని రాజన్నదొర చెప్పారు. మొదటి నుంచి ఈ వ్యవస్థకు టిడిపి, జనసేన నాయకులు వ్యతిరేకంగా ఉన్నారని చెప్పారు. సచివాలయం, వాలంటీర్ వ్యవస్థల వల్ల గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలందుతున్నాయన్నారు. వృద్ధులు, వికలాంగులకు ఇంటివద్దకే వెళ్లి పింఛను మొత్తాలను అందజేస్తున్న ఘనత వాలంటీర్లదేనన్నారు. సంక్షేమ పథకాలందుకుంటున్న లబ్దిదారుల కుటుంబాల్లో వాలంటీర్లు సభ్యులుగా మారారని చెప్పారు. కావున రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించకపోతే సంక్షేమ పథకాలతో పాటు సచివాలయం, వాలంటీర్ల వ్యవస్థ ప్రశ్నార్థకంగా మారుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిపి జి.రాములమ్మ, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, మండల వైసిపి అధ్యక్షులు సువ్వాడ భరత్ శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు, జెసిఎస్ కన్వీనర్ కె.త్రినాధనాయుడు, ఎంపిడిఒ ఫణీంద్రకుమార్, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

రాజన్నదొరకు టిడ్కో లబ్దిదార్లు సన్మానం

పట్టణంలోని 26వార్డుకు చెందిన టిడ్కో ఇళ్ల లబ్దిదారులు గురువారం డిప్యూటీ సీఎం రాజన్నదొరను సన్మానించారు. వార్డు వైసిపి నాయకులు కర్రి అప్పలస్వామి ఆధ్వర్యాన లబ్దిదారులు రాజన్నదొరను ఆయన నివాసంలో ఘనంగా సన్మానించారు. ఎన్నో ఏళ్లుగా అందని ద్రాక్ష పండ్లులా ఉన్న టిడ్కో ఇళ్లను పేదలకు అందేలా చేయడంలో రాజన్నదొర కృషి మరువలేనిదని చెప్పారు. తమ కుటుంబాలకు సొంత ఇంటి కల సాకారం చేశారని ఆనందం వ్యక్తం చేశారు.

ఆరోగ్య రక్షణకు సౌకర్యాలు కరువు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రభుత్వం ఆశ్రమ పాఠశాలల్లో రంగులకు ఇచ్చే ప్రాధాన్యత విద్యార్థుల ఆరోగ్యానికి ఇవ్వడం లేదని, దీంతో తరచూ విద్యార్థుల మరణాలు జరుగుతున్నాయని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్ అన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల చదువుకు, ఆరోగ్య పరిరక్షణకు సరైన సౌకర్యాల్లేవన్నారు. ప్రాథమిక స్థాయిలో వైద్యమందడం లేదన్నారు. ఇందుకు కారణం ఆరోగ్య కార్యకర్తల్లేకపోవడమేనని అన్నారు. ఐటిడిఎ అధికారులు ఏజెన్సీలోని ఆశ్రమ పాఠశాలలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి, పారిశుధ్యం వంటివి పరిశీలించినట్టు ఎక్కడా కానరావడం లేదన్నారు. ఏజెన్సీలో ఇటీవల కాలంలో సికిల్‌సెల్ ఎమియా వ్యాధి ఎక్కువగా ప్రబలుతుందని, ఆ ప్రభావం విద్యార్థులపై పడుతుందని అన్నారు. విద్యార్థులకు అనారోగ్యం వాటిలితే ప్రాథమిక స్థాయిలో వైద్యం అందించాల్సి ఉండగా వైజాగ్ రిఫర్ చేయడం పరిపాటిగా మారిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని ఏజెన్సీలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు.

పసిప్రాణాలు పోతున్నా పట్టించుకోరా? : టిడిపి


జిల్లాలో విద్యార్థుల మరణ మృదంగం కొనసాగుతూనే ఉందని, రోజుకొకరు చొప్పున విద్యార్థులు మృత్యువాత పడుతున్నా ప్రభుత్వం, పాలకులు కనీసం పట్టించుకోరానని టిడిపి అరకు పార్లమెంట్ ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు ప్రశ్నించారు. ప్రతి రోజు పత్రికల్లో జిల్లాలో ఏదో ఒక మండలంలో గిరిజన విద్యార్థులు చనిపోతున్నారన్న వార్తలు వస్తున్నా నివారణా చర్యలు తీసుకోవడంలో మాత్రం శ్రద్ధ చూపడం లేదని అన్నారు. ఇదేనా గిరిజన విద్యార్థుల పట్ల వారి సంక్షేమం పట్ల ప్రభుత్వం, పాలకులు చూపిస్తున్న ప్రేమ అంటూ మండిపడ్డారు. నెల రోజుల్లో ఐదుగురు విద్యార్థులు మృత్యువాతపడడం బాధాకరమన్నారు. పిఒ, డిడి స్థాయి అధికారులు కూడా ఆశ్రమ పాఠశాలల పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందన్నారు. తక్షణమే ఆశ్రమ పాఠశాలల్లో ఆరోగ్య కార్యకర్తలను నియమించాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక స్థాయిలోనే మెరుగైన వైద్యం అందించి విద్యార్థుల ప్రాణాలను కాపాడాలని కోరారు.

నేడు సరాయివలస, ఎర్రసామంతవలసలో ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ పర్యటన

పార్వతీపురం : వ్యాధుల బారినపడి ఇటీవల గిరిజన విద్యార్థులు వరుస మరణాలు చెందిన నేపథ్యంలో రాష్ట్ర ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు సరాయివలస, ఎర్రసామంతవలసలో పర్యటించనున్నారు. పాచిపెంట మండలం సరాయివలస గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలను, అలాగే మక్కువ మండలం ఎర్రసామంత వలస గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో శుక్రవారం పర్యటించనున్నారు.

వార్డెన్ సస్పెన్షన్

మక్కువ : మండలంలోని ఎర్రసామంతవలస బాలుర ఆశ్రమ పాఠశాల వార్డెన్ చంద్రరావును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు అమరావతి నుంచి జారీ అయ్యాయి. గిరిజన విద్యార్థి అశోక్ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై గిరిజన సంక్షేమ శాఖ హాస్టల్ వార్డెన్ సస్పెండ్ చేస్తూ గురువారం ఉదయం ఉత్తర్వులు జారీ చేసింది.



పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

విద్యార్థుల మరణాలతో కదిలిన యంత్రాంగం

గుమ్మలక్ష్మీపురం : పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో గిరిజన విద్యార్థుల వరుస మరణాలతో ప్రభుత్వ యంత్రాంగం కదిలింది. ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్ ఆదేశాల మేరకు వైద్యశాఖ అధికారులు భద్రగిరి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను, చనిపోయిన బాలిక చదువుతున్న భద్రగిరి పిటిజి బాలికల గురుకుల పాఠశాలను గురువారం సందర్శించారు. సిహెచ్‌సి వైద్యులు పాఠశాల సిబ్బందితో విద్యార్థుల ఆరోగ్యంపై మాట్లాడారు. ఈ మేరకు పాఠశాల సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యార్థుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

ప్రభుత్వం, అధికారులే బాధ్యత వహించాలి : సిఐటియు

సాలూరు రూరల్ : జిల్లాలో 2023 జూన్ నుంచి నేటి వరకూ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో 16 మంది విద్యార్థులు అనారోగ్యాలతో మృతి చెందారని, వీరి మరణాలకు ఐటిడిఎ, ప్రభుత్వమే బాధ్యత వహించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు అన్నారు. మామిడిపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్‌ఎంలను నియమించకపోవడం, ఐటిడిఎ పాలకమండలి సమావేశాలు జరిపి హాస్టల్లో మౌలిక సదుపాయాలపై చర్చించకపోవడం, విద్యార్థుల్లో రక్తహీనత తదితర సమస్యలు గుర్తించే అవకాశం లేకపోయిందన్నారు. దీనికి బాధ్యత అధికారులు, ప్రభుత్వమే వహించాల్సి ఉంటుందని తెలిపారు. ఇప్పటికైనా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి స్పందించి వరుస సంఘటనపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి, మరణాలకు గల కారణాలను అధ్యయనం చేసి నష్టనివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో సిఐటియు మండల నాయకులు జరజాపు జ్యోతిశ్వరరావు, కె.భాస్కరరావు పాల్గొన్నారు.

26న రౌండ్ టేబుల్ సమావేశం

గుమ్మలక్ష్మీపురం : మన్యంలో జరుగుతున్న గిరిజన విద్యార్థుల మరణాలపై ఈ నెల 26న మధ్యాహ్నం 3గంటలకు పార్వతీపురంలో విద్యార్థి, యువజన, గిరిజన, ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు గిరిజన సంక్షేమ సంఘం, గిరిజన నిరుద్యోగ సంఘాల నాయకులు పాలక రంజిత్ కుమార్, తాడంగి సాయిబాబు, ఆరిక ప్రభాకర్, ఉర్లక నాగార్జున, చందు తదితరులు తెలిపారు. ఈ సమావేశంలో అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.



పోటీలను ప్రారంభిస్తున్న మన్మథరావు

డివైఎఫ్ఐ ఆధ్వర్యాన క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

క్రీడలు మానసిక ఒత్తిడిని తొలగిస్తూ, నైపుణ్యతను, శారీరక ధృఢతత్వాన్ని పెంచుతాయని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.మన్మథరావు అన్నారు. మండలంలోని రావికోనలో సర్పంచ్ కద్రక రామస్వామి, భారత యువజన సమైక్య (డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో గ్రామస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం నిర్వహించారు. ఈటోర్నీమెంట్‌ను ప్రారంభించిన అనంతరం మన్మధరావు మాట్లాడుతూ క్రీడల వల్ల యువత భవిష్యత్తుతో పాటు, ఆయా గ్రామాలకు కూడా మంచి పేరు తీసుకొచ్చే కర్తవ్యం వీరిపై ఉందని అన్నారు. దీన్ని ఆసరాగా తీసుకొని ప్రస్తుత వైసిపి ప్రభుత్వం ఆడదామా ఆంధ్ర కార్యక్రమం, వైసిపి ప్రచార ఆంధ్రగా మారిందని విమర్శించారు. ఇందులో ఎంతలా రాజకీయ జోక్యం చొరబడిందంటే ఇటీవల రాష్ట్రస్థాయిలో జిల్లా నుంచి ఎన్నికైన పాచిపెంట క్రికెట్ టీంను కాకుండా, ఎటువంటి స్థాయిని పొందని పార్వతీపురం టీమును రాష్ట్ర స్థాయికి పంపడమేనన్నారు. క్రీడల నిర్వహణ అనంతరం క్రీడాకారుల సామాగ్రిలు కూడా వెనక్కి తీసుకోవడం చాలా సిగ్గుమాలిన చర్యని మండిపడ్డారు. యువతలో క్రీడాతత్వం ప్రోత్సహించడం అంటే ఆటలు నిర్వహించడమే కాదని, నిరంతరం వారికి తగిన ప్రోత్సాహకర సామాగ్రి ఇవ్వడం కూడా ప్రభుత్వం బాధ్యతగా తీసుకోవాలని అన్నారు. గతంలో అనేక ఉద్యోగాల ఎంపికల్లో క్రీడా రంగానికి గుర్తింపు ఉండేదని, దాన్ని క్రమేపి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విస్మరించి పోయారని మండిపడ్డారు. రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన మాటల ప్రలోభాలకు గురికావొద్దని, బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ వంటి మత విధ్వంసపు విధానాల మన గ్రామాల్లో చొరబడకుండా ప్రతిఘటించాలని, ప్రజా అంకితానికి కట్టుబడి ఉన్న సిపిఎం బలోపేతానికి యావత్తు యువతరం సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ హెచ్.లక్ష్మణరావు, డివైఎఫ్ఐ, నిర్వాహక కమిటీ హెచ్.సింహాచలం, ప్రసాద్, నగేష్, చిరంజీవి, పోలిరాజు, కామేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



గోతిలో కూరుకుపోయిన కర్రల లారీ

రోడ్డు మధ్యలో దిగబడిన లారీ

రెండు గంటల పాటు ట్రాఫిక్ జామ్

ప్రజాశక్తి - కొమరాడ

పార్వతీపురం నుంచి ఒడిస్సా వెళ్లే అంతరాష్ట్ర రహదారి అధ్వానంగా తయారైంది. దీంతో గురువారం గుమ్మడ గ్రామ సమీపం వద్ద రోడ్డుపై ఏర్పడిన భారీ గోతిలో లారీ దిగుబడిపోయింది. దీంతో సుమారు రెండు గంటల పాటు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయి భారీ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. అధికారులకు చెప్పినా ఫలితం శూన్యమని వాహనదారులు చొరవ తీసుకుని స్థానిక జెసిబి సహాయంతో లారీని బయటకు తీసి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేశారు. పార్వతీపురం నుంచి కూనేరు వరకు పలు ప్రాంతాల్లో రహదారిపై భారీ గోతులు ఏర్పడడంతో ఎప్పటికప్పుడు అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుపై ఉన్న గోతులు కప్పాలని అనేకసార్లు సిపిఎం ఆధ్వర్యంలో నిరసనలు చేసినా అధికారులు కనీస పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా రోడ్డుపై ఏర్పడిన గోతులను కప్పి ప్రమాదాలను నివారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మేమే గోతులను పూడ్చుతాం

నెలాఖరు నాటికి రోడ్లపై పడిన గోతులను అధికారులు పూడ్చకపోతే తామే పూడ్చుతామని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి తెలిపారు. గురువారం ట్రాఫిక్ అంతరాయం ఏర్పడిన ప్రదేశాన్ని పరిశీలించి ప్రయాణికులతో రహదారిపై నిరసన కార్యక్రమం చేపట్టారు. రోడ్డులో బాగు చేయాలని అనేకసార్లు ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్న కనీసం ప్రభుత్వం స్పందించకపోవడం చాలా దుర్మార్గమన్నారు.

మృతులకు ఆరోగ్యశ్రీ కార్డులు

ఇదీ అధికారుల తీరు

ప్రజాశక్తి - వీరఘట్టం

మృతి చెందిన వారి పేరున వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరు చేసి అధికారులు మరోసారి తమ పనితీరును బయటపెట్టారు. మండల కేంద్రంలోని దళిత వీధికి చెందిన చింతాడ బొడ్డమ్మ, శైల తవిటమ్మ, అంబటి జ్యోతి రెండేళ్ల క్రితం మరణించారు. అయితే వీరికి డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కార్డులను గురువారం గ్రామ వాలంటరీ మృతుల కుటుంబ సభ్యులకు అందజేశారు. గతంలో వీరు అనారోగ్యానికి గురై వేలాది రూపాయలు వెచ్చించి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొంది చివరకు మృతి చెందారు. రూ.25 లక్షల విలువ గల వైయస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డులు అప్పట్లో మంజూరై ఉంటే తమ వారు ఇప్పుడు మృతి చెందేవారు కాదని కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రచారం కోసం గ్రామ వాలంటీర్లు ఇలా కార్డులు పంపిణీ చేస్తున్నారన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

శృతి కుటుంబానికి రూ.10 లక్షలు చెల్లించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

భద్రగిరి పిటిజిలో ఏడో తరగతి చదువుతూ జ్వరంతో మృతి చెందిన బిడ్డిక శృతి కుటుంబానికి రూ.10 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని ఎస్ఎఫ్ఐ మండల కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. పిటిజి పాఠశాలను ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం సందర్శించారు. విద్యార్థిని మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి, సౌకర్యాలు, పౌష్టికాహారం పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో విద్యార్థుల మరణాలు జరగకుండా ప్రతి ఆశ్రమ పాఠశాలలో ఆరోగ్య కార్యకర్తలను నియమించి విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని, పౌష్టికాహారం సక్రమంగా పెట్టాలని, ఎప్పటికప్పుడు మెడికల్ క్యాంపులు నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు జానీ, నవీన్, చందు, మండల సహాయ కార్యదర్శులు అనిల్, శివకుమార్ డిమాండ్ చేశారు.


అవగాహన కల్పిస్తున్న ఎపిఎం రాణి రత్నకుమారి

విడివికెల ద్వారా గిరిజనులకు శిక్షణ

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజ నులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని ఎపిఎం రాణి రత్నకుమారి అన్నారు. గురువారం మండలంలోని పెద శాఖ గ్రామంలో వీడీవీకే ద్వారా కొండచీపురుల విక్రయం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాణీరత్న కుమారి మాట్లాడుతూ మండలంలో 50 మంది సభ్యులకు ఆదేశాల మేరకు శిక్షణ ఇస్తున్నామన్నారు. శిక్షణకు వచ్చిన ఒక్కొక్క సభ్యులకి రోజుకి రూ.150 ఇస్తామన్నారు. గిరిజన ప్రాంతాల్లో లభ్యమయ్యే అటవీ ఉత్పత్తులను వీడీవీకే కేంద్రాల ద్వారా అమ్మకాలు చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పిఒ సిసి ఈశ్వరమ్మ, జనరల్ సిసి గణేష్ కుమార్, వెంకటరమణ విడివికె సభ్యులు ఉన్నారు.

భూసారంపై అవగాహన

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

భూసారంపై అవగాహనా కార్యక్రమ స్థానిక ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాల గురువారం నిర్వహించారు. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు వ్యవసాయంలో నేల ఆరోగ్య పరిరక్షణ, భూసార పరీక్షలు నిర్వహణ, తద్వారా సుస్థిర వ్యవసాయాభివృద్ధి సాధించడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్, జిల్లా ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ ఆర్.శ్రీనివాసరావు, ఎడి ఎ.నిర్మలజ్యోతి, కృషి విజ్ఞాన కేంద్రం రస్తాకుంటుబాయి సస్యపోషణ విభాగ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ స్రవంతి, కురుపాం మండల ఎఒ పి.నాగేశ్వరరావు, పాఠశాల ప్రిన్సిపల్ పట్నాయక్ పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి అందజేత

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని గోపాలపురానికి చెందిన సవరిగాన శివకుమార్ అకాల మరణం చెందడంతో శాసనమండలి ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్ సిఫార్సు మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.5లక్షల చెక్కును శివకుమార్ భార్య సంధ్యారాణికి వారి స్వగ్రామంలో విక్రాంత్ గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి బొమ్మాళి భాను, వైస్ ఎంపిపిలు కణపాక సూర్యప్రకాష్, వాకముడి అనిల్, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.


చెక్కును అందిస్తున్న ఎమ్మెల్సీ

నేడు టిడిపి విస్తృత స్థాయి సమావేశం

ప్రజాశక్తి - కురుపాం

టిడిపి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం నియోజకవర్గ కేంద్రంలోని సాయిరాం గుడి ఎదురు మైదానం వద్ద నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ ఇన్చార్జి టి. జగదీశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో గల రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు, అన్ని అనుబంధ విభాగాల కమిటీ నాయకులు, క్లస్టర్ ఇంఛార్జిలు, యూనిట్, బూత్ ఇంచార్జిలు, గ్రామ కమిటీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

విక్రంపురంలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని విక్రంపురంలో గురువారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి ప్రదీప్ వివిధ రకాలైన రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలను పరిశీలించిన రాష్ట్ర బృందం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

అభ్యసనా అభివృద్ధి అమలు పరిశీలనలో భాగంగా గురువారం విద్యా శాఖకు చెందిన రాష్ట్రస్థాయి బృందం మండలంలోని పెద్ద బొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 6, 7, 8 తరగతికి చెందిన విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసన స్థాయిని తెలుసుకున్నారు. ఎల్ఐపి అమలులో భాగంగా తరగతి గదిలో ఉపాధ్యాయుల బోధన సాధన సోపానాలు మెలకువలు కృత్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రస్థాయి బృంద సభ్యులు, ప్రధానోపాధ్యాయులు వి గౌరీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

2న మండల సర్వసభ్య సమావేశం

వీరఘట్టం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మార్చి 2న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఎస్.సాల్మన్‌రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సర్పంచులు, ఎంపిటిసిలు, మండల స్థాయి అధికారులు ఉదయం 10.30 గంటలకు సమయం పాటించి విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎపి మధ్యాహ్న భోజనం పథకం కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వై.శాంతి కుమారి డిమాండ్ చేశారు. గురువారం సుందరయ్య భవనంలో ఆమె మాట్లాడుతూ దీర్ఘకాలంగా మధ్యా హ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించడంలేదని, దీంతో మధ్యాహ్న భోజనం నిర్వహణ చాలా కష్టతరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తరచూ మెనూ మారుస్తున్నప్పటికీ మెస్ ఛార్జీలు, మధ్యాహ్న భోజన నిర్వాహకుల జీతాలు పెంచడం లేదని అన్నారు. పాదయాత్ర సందర్భంలో మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10వేలు వేతనం, ఇతర సమస్యలు పరిష్కరిస్తామని సిఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ నేటికీ అమలు కాలేదన్నారు. ఇప్పటికైనా మెనూ ఛార్జీలు, మధ్యాహ్న భోజన కార్మికులకు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా జీతాలు చెల్లించాలని, యూనిఫాం, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు పావని పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

29న భవన నిర్మాణ కార్మికుల నిరాహార దీక్ష

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించి, సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని, వారికి సంక్షేమ పథకాలు అందించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.గోరీశ్వరరావు, రాయపల్లి రాము డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సుందరయ్య భవనంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తానని ఎన్నికల ముందు జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని, ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాత మొట్టమొదట భవన నిర్మాణ కార్మికుల బతుకులను నాశనం చేసేలా ఇసుక విధానం తీసుకొచ్చారని అన్నారు. కరోనా సమయంలో భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు అర్థాకలితో ఇబ్బందులు పడ్డా కనీసం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం కనికరించలేదన్నారు. పైగా మడమ తిప్పను మాట తప్పనని నమ్మించి తండ్రి తెచ్చిన సంక్షేమ బోర్డును కొడుకు జగన్మోహన్‌రెడ్డి రద్దు చేయడం అత్యంతదారుణమైన విషయమన్నారు. సంక్షేమ బోర్డు రద్దు వల్ల భవన నిర్మాణ కార్మికులు అనేక సంక్షేమ పథకాలు కోల్పోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. నాలుగున్నరేళ్లయినా ఇప్పటికీ భవన నిర్మాణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆలోచించలేదని, కావున భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు పునరుద్ధరించి పిల్లలకు స్కాలర్‌షిప్, గుర్తింపు కార్డులు, పెండింగ్ క్లైములు, ఇన్సూరెన్స్, ఇఎస్ఐ వంటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. వీటి కోసం ఈనెల 29న జిల్లా కేంద్రంలో జరిగే నిరాహార దీక్షలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు, కోశాధికారి గొర్లి వెంకటరమణ, బి.సూరిబాబు, ఎఐటియుసి నాయకులు టి.జీవ, భవన నిర్మాణ కార్మికులు దుర్గారావు, ఎం.శ్రీను, రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

పారినాయుడుకు సాహితీ సత్కారం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

సాహితీ లహరి, స్నేహ కళాసాహితీ, అభ్యుదయ రచయితల సంఘం, సాలూరు సాహితీ మిత్రబృందం సంయుక్త నిర్వహణలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం బుధవారం రాత్రి కన్నుల పండుగగా జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు మాట్లాడుతూ తెలుగు భాషను పూర్వీకులు పటిష్టం గావించారని, దీన్ని నేటితరం నిలుపుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీతలు బెలగాం భీమేశ్వరరావు, నారంశెట్టి ఉమామహేశ్వరరావు తెలుగు భాష గొప్పతనాన్ని తమదైన శైలిలో వినిపించారు. ప్రధానవక్త చుక్క పారినాయుడు మాట్లాడుతూ తెలుగు భాష కమ్మదనాన్ని సంతరించుకొని ఉందని, దీన్ని ఇప్పటి వారికి తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అంటూ చక్కనైన తెలుగు పద్యాలను సభ్యులకు వినిపించారు. అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులు చింతా అప్పలనాయుడు, స్నేహకళా సాహితీ అధ్యక్షులు మల్లిపురం జగదీష్, సాలూరు సాహితీ మిత్ర బృందం కార్యదర్శి గొట్టాపు శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు. కవిరత్న జెబి తిరుమలాచార్యుల సారథ్యంలో జరిగిన తెలుగు భాషా దినోత్సవం ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నది. ప్రముఖ కవులు గంటేడ గౌరునాయుడు, లంకా వెంకటస్వామి, వంజరాపు శేషు తదితర పెద్దలు ఈ సందర్భంగా పారినాయుడును ఘనంగా సత్కరించారు.


పారినాయుడును సత్కరిస్తున్న నిర్వాహకులు

క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తం : డిఎంఒ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కుసిమి, దోనుభాయి పిహెచ్‌సిలు, గిరిజన సంక్షేమ హాస్టళ్లు, ప్రాంతీయ ఆసుపత్రులను జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు గురువారం సందర్శించారు. పిహెచ్‌సిల్లో ల్యాబ్ రికార్డులు తనిఖీ చేసి ప్రతి రోజూ చేపడుతున్న జ్వర నిర్ధారణ పరీక్షలు, వాటి నివేదికలు పరిశీలించారు. మలేరియా, డెంగీ నిర్ధారణ అయితే సత్వరమే చికిత్స అందజేసి, క్షేత్ర స్థాయిలో సిబ్బంది పర్యవేక్షించి, ఆ ప్రాంతంలో నివారణా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మందులు, వార్డు, వ్యాక్సిన్ నిల్వలు తనిఖీ చేశారు. ఆసుపత్రిలో క్షేత్ర స్థాయిలో సిబ్బంది అందుబాటులోనూ, అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమల ఆవాస ప్రాంతాల్లో స్ప్రేయింగ్ చేయించాలన్నారు. అనంతరం గిరిజన సంక్షేమ హాస్టళ్లను సందర్శించి అక్కడ సిబ్బందితో సమీక్షించి విద్యార్థుల ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిక్‌రూంలో అనారోగ్య లక్షణాలున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. ప్రతి రోజూ ఆరోగ్య పర్యవేక్షణ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. వసతి గృహాల కిటికీలకు మెస్‌లు ఉండాలన్నారు. అనంతరం స్థానిక ఏరియా ఆసుపత్రి ల్యాబ్‌లో రికార్డులు తనిఖీ చేసి జ్వరాలు ఏ మేరకు నమోదవుతున్నాయి పరిశీలించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.శ్రీనివాసరావు, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ వెంకటరావుతో కలిసి ఆయన వార్డులో జ్వర లక్షణాలతో ఉన్న వారి ఆరోగ్యం పరిశీలించారు. అలాగే అక్కడ ఎఆర్‌సి కేంద్రాన్ని సందర్శించి పౌష్టికాహార లోపం ఉన్న పిల్లలు ఎంత మంది చేరారు, వారి ఆరోగ్య ఏ మేరకు వృద్ధి చెందినదే పరిశీలించారు. కార్యక్రమంలో ఎఎంఒ సూర్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి జి.మోహన్రావు, మలేరియా టెక్నికల్ సూపర్ వైజర్ ఝాన్సీ ఉన్నారు.


రోగులతో మాట్లాడుతున్న జగన్మోహన్‌రావు

రహదారి కల్పనే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - కురుపాం

రహదారి సౌకర్యం లేని ప్రతి గిరిజన గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని స్థానిక ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని బియ్యాలవలస పంచాయతీ షేక్‌పాడు గిరిజన గ్రామానికి రూ.47 లక్షల ఉపాధి హామీ నిధులతో మంజూరై పూర్తన బిటి రోడ్డును గురువారం ఆమె ప్రారంభించారు. ప్రతి గిరిజన గ్రామానికి రహదారి, విద్య, వైద్యం, మౌలిక వసతులు కల్పనే లక్ష్యంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజ్, ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్పిటిసి సభ్యులు జి.సుజాత, జిల్లా కో-ఆప్షన్ సభ్యులు షేక్ నిసార్, వాణిజ్య విభాగాల జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు, గ్రీవెన్స్ జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, మండల కన్వీనర్ ఐ.గౌరీశంకర్, స్థానిక సర్పంచ్ పి.అజారి, పంచాయతీ కార్యదర్శి కె.అనురాధ, మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ జిలాని, అయ్యర్కుల కార్పొరేషన్ డైరెక్టర్ జి.విజయ్ చంద్రశేఖర్, కలింగవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కె.సురేష్ కుమార్, ఇంజనీరింగ్ అధికారులు, ఎంపిటిసి వి.బంగారు నాయుడు, టివిఎస్ స్వాయోజులు, పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కెజిబివి సందర్శన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని జోగంపేటలోని కేజీబీవీ పాఠశాలను లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం జిల్లా బృంద సభ్యులతో పాటు మండల విద్యాశాఖ అధికారి సూరిదేముడు గురువారం సందర్శించారు. ముందుగా తరగతి గదిలో టీచింగ్ పీరియడ్, ప్రాక్టీస్ పీరియడ్ లను గణితం, సోషల్, ఇంగ్లీష్‌లలో సమీక్షించారు. బోధనా పద్ధతులను పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులు ఫోకస్డ్ చిల్డ్రన్ ను దృష్టిలో ఉంచుకొని తగు విధంగా చదవడం, రాయడం మీద శ్రద్ధ చూపాలని, లెర్నింగ్ స్కిల్స్ మెరుగుపరచాలని, వాటికి ప్రత్యేక రికార్డ్స్ మైంటైన్ చేయాలని తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంప్రూవ్మెంట్ ప్రోగ్రాం డిస్ట్రిక్ట్ సభ్యులు నల్లా తిరుపతి నాయుడు, నరేష్, ప్రవీణ్, జొన్నాడ సంధ్య, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బృంద సభ్యులు

రెండోరోజుకు ఆదివాసీల నిరసన

ప్రజాశక్తి - సాలూరురూరల్

తాము సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వకుండా మోసగించిన తహశీల్దార్, విఆర్‌ఒలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం నిర్వహించిన నిరసన కార్యక్రమం గురువారం రెండో రోజు చేరింది. ఈ కార్యక్రమానికి సంఘీభావం తెలిపిన ప్రజానాట్య మండలి సభ్యులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ రాజకీయ నాయకుల వల్లే ప్రభుత్వ ఉద్యోగులు కూడా విడదీసి పాలించే అనే పద్ధతిని అవలంబిస్తున్నారని ఇటువంటి పద్ధతి అధికారులకు ఎంత మాత్రం తగదని అన్నారు. వెంటనే సర్వే నిర్వహించిన భూములకు పట్టాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు వంతల సుందరరావు, గెమ్మెల కాశీ, గిరిజనులు పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి : సంధ్యారాణి

ఎన్నో ఏళ్లుగా సాగు చేస్తున్న భూములకు పట్టాలిస్తామని చెప్పి నేటికి మూడేళ్లవు తున్నా పట్టాలను మంజూరు చేయకపోగా, గిరిజనుల మధ్య తగాదాలు పెట్టిన అధికారులపై చర్యలు తీసుకోవాలని టిడిపి ఇన్‌ఛార్జి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ గిరిజనుల నిరసన శిబిరం వద్ద ఆమె సంఘీభావం తెలిపారు.


మాట్లాడుతున్న సంధ్యారాణి

అనంతరం ఆమె మాట్లాడుతూ గిరిజనులు ఈ ప్రభుత్వంలో తీవ్రంగా నష్టపోతున్నారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి వారికి రావాల్సిన పట్టాలను సక్రమంగా అందజేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్, సాలూరు, పాచిపెంట మండల, పట్టణ అధ్యక్షులు ఆముదాల పరమేష్, పిన్నింటి ప్రసాద్, నిమ్మాది చిట్టి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ సారథులే వాలంటీర్లు

ప్రజాశక్తి - కురుపాం

సంక్షేమ పథకాలను ప్రజలకు అందించి వారి గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిన సంక్షేమ సారథులే వాలంటీర్లని మన్యం జిల్లా వైసిపి అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత రాజు అన్నారు. గురువారం స్థానిక వైయస్సార్ కాంతి పథం కార్యాలయం వద్ద ఎంపిడిఒ ఎస్. అప్పారావు ఆధ్వర్యంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో వాలంటీర్లు ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలు అందించడం చాలా గొప్ప విషయమన్నారు. అటువంటి వాలంటీర్ల సత్కార కార్యక్రమంలో భాగస్వామిని అయినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం సేవావజ్ర, సేవరత్న, సేవామిత్ర పొందిన వాలంటీర్లకు అవార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్పిటిసి జి.సుజాత, జిల్లా కో-ఆప్షన్ సభ్యులు షేక్ నిసార్, వాణిజ్య విభాగాల జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు, గ్రీవెన్స్ జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, మండల కన్వీనర్ ఐ.గౌరీ శంకర్, మేజర్ పంచాయతీ సర్పంచ్ జీ సుజాత ఉపసర్పంచ్ షేక్ ఆదిల్, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ జిలాని, అయ్యర్కుల కార్పొరేషన్ డైరెక్టర్ జి.విజయ్ చంద్రశేఖర్, ఎంపిటిసి వి. బంగారు నాయుడు, టీవీఎస్ స్వాయోజులు, సంతోషిని, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



బలిజిపేట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: వాలంటీర్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆలోచనను ప్రజల మధ్యకు తీసుకువెళ్ళి వాలంటీర్లు అందించే విశేష సేవలను గుర్తు చేసి మళ్లీ ప్రజా ప్రభుత్వం వచ్చేందుకు మీరంతా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గుడివాడ నాగమణి, జెడ్పిటిసి అలజంగి రవి కుమార్, వైస్ ఎంపిపి వెలిది సాయిరాం, వైసిపి మండల అధ్యక్షులు పాలవలస మురళీకృష్ణ, నాయకులు పాలూరి నారాయణరావు, అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచాలి

ప్రజాశక్తి- పాచిపెంట

రైతులు నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచి తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు పండించి అధిక దిగుబడులు సాధించే విధంగా పంటల ప్రణాళికలను రూపొందించుకోవాలని సాలూరు సహాయ వ్యవసాయ సంచాలకులు మధుసూదన్ రావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ సమీకృత నీటి పారుదల, జీవన వనరుల అభివృద్ధి పథకంలోని గ్రామస్థాయి శిక్షణ కార్యక్రమంలో భాగంగా పాంచాలి రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన రైతు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులు సాంప్రదాయ వరి నాటే విధానాన్ని వీడి తక్కువ నీటితో అధిక దిగుబడులు వచ్చే డ్రం సీడర్ విధానాన్ని అవలంబించాలలన్నారు. ఈ విధానంలో ఖర్చు రూ.6వేలు తగ్గుతుందని సమయం ఆదా అవుతుందని చెప్పారు. చెరువులో ఉన్న నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచాలంటే పిల్ల కాలువలు ఏర్పాటు చేసుకోవాలని గట్ల మీద కూరగాయలు, కంది విత్తనాలు నాటుకోవడం ద్వారా అదనపు ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కే తిరుపతిరావు, విఎఎ శ్రీను, సిఆర్‌పి ఎల్ఎన్ తిరుపతి నాయుడు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎడిఎ మధుసూదన్‌రావు

గ్రూప్ -2 మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

నిరుద్యోగ గిరిజన యువత ఖాళీ సమయాన్ని వృధా చేయకుండా ప్రభుత్వం విడుదల చేస్తున్న అన్ని రకాల పోటీ తత్వ పరీక్షలకు సిద్ధమై ఫలితాలలో మంచి ప్రతిభ చూపించాలని మాజీ జడ్పిటిసి కె.లక్ష్మీ అన్నారు. గుమ్మలక్ష్మీపురంలోని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో యువతకు గ్రూప్2 మెటీరియల్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏజెన్సీలో ప్రతిభ కలిగిన విద్యార్థులు, యువత ఎంతోమంది ఉన్నారని వారికి సరైన ప్రోత్సాహం లేక ఉద్యోగ ఉపాధి పొందలేకపోతున్నారని అన్నారు. అటువంటి వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పోటీ పరీక్షల మెటీరియల్ అందిస్తున్నారని తెలిపారు. అనంతరం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్ మాట్లాడుతూ పంపిణీ చేసిన మెటీరియల్ చక్కగా వినియోగించుకొని పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెముడు గూడ ఎంపిటిసి మండంగి రమణ, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పి. మోహన్ రావు, పాండు రంగ ఉన్నారు.



అభ్యర్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

రవికి ఐక్యరాజ్యసమితి పిలుపు

ప్రజాశక్తి - సీతంపేట

ఐక్యరాజ్య సమితి పర్యావరణ సదస్సుకు శ్రీకాకుళంలోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ (ఐఐఐటి) అసిస్టెంట్ ప్రొఫెసర్ గేదెల రవికి ఆహ్వానం వచ్చింది. మానవజాతి కార్యకలాపాల వల్ల పెరుగుతున్న పర్యావరణ సమస్యల పరిష్కారానికి ఐక్యరాజ్య సమితి పర్యావరణ కార్యక్రమం (యుఎన్ఇపి) నైరోబిలో ఈనెల 26 నుండి మార్చి 1 వరకు జరుగుతుంది. ఇందులో ప్రభుత్వాలు, పౌర సమాజ గ్రూపులు, జర్నలిస్టులు, శాస్త్రీయ సంఘం, ప్రైవేట్ రంగాల వారిని ఆహ్వానిస్తారు. అందులో భాగంగా రవికి ఆహ్వానం అందింది. ఈ ఏడాది చారిత్రాత్మక ఐక్యరాజ్యసమితి సదస్సులో ఎప్పటికప్పుడు పెరుగుతున్న వాతావరణ మార్పులు, జీవవైవిధ్య నష్టం, కాలుష్యాన్ని ఎదుర్కోవడానికి సమర్థవంతమైన, సమ్మిళిత, స్థిరమైన బహుపాక్షిక చర్యలపై దృష్టి సారించడం గూర్చి చర్చించామని పేర్కొన్నారు.


గేదెల రవి

టిడిపిలో ఫ్లెక్సీ వార్

సంధ్యారాణి, తేజోవతి అనుచరుల మధ్య గొడవ

ప్రజాశక్తి - సాలూరు

నియోజకవర్గ టిడిపిలో గ్రూపు రాజకీయాలు తారాస్థాయికి చేరుతున్నాయి. నియోజకవర్గ ఇంఛార్జి సంధ్యారాణి, ఆశావహ అభ్యర్థి తేజోవతి అనుచరుల మధ్య విబేధాల అగ్గి రాజుకుంటోంది. గతనెల జరిగిన శంబర పోలమాంబ జాతర సందర్భంగా తలెత్తిన ఫ్లెక్సీ వార్ ఇప్పుడు ముదిరి పాకాన పడుతోంది. మండలంలోని జనవరివలసలో బుధవారం సంధ్యారాణి ఫ్లెక్సీలను ఆమె వ్యతిరేక వర్గీయులు చించివేయడానికి ప్రయత్నించగా సంధ్యారాణి అనుచరులు తీవ్రంగా ప్రతిఘటించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఇరువర్గాల మధ్య గొడవ జరగడంతో ఒకరిపై ఒకరు దాడి చేసుకునే పరిస్థితి తలెత్తినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై టిడిపి సోషల్ మీడియా గ్రూపుల్లో చర్చనీయాంశమైంది.


గొడవకు కారణమైన ఫ్లెక్సీ ఇదే..

ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాలు గురువారం ప్రారంభమయ్యాయి. రోజుకు నాలుగు కళాజాతా కార్యక్రమాలు చొప్పున జిల్లాలో ఎంపిక చేసిన 25 గ్రామాల్లో రెండు కళాజాతా బృందాలతో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.జగన్నాధరావు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హెచ్ఐవి, ఎయిడ్స్‌పై యువత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో యువతకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో ఆర్‌బిఎస్‌కె పిఒ డాక్టర్ డి.భాస్కరరావు, డిఐఒ డాక్టర్ నారాయణరావు, జిల్లా క్రీడాఅభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ ఎన్‌పి బాలాజీ, జిల్లా సూపర్వైజర్ ఎన్.సాక్షి గోపాలరావు, సిబ్బంది, ఎంజిఒలు, పాల్గొన్నారు.

24న కుసిమిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కుసిమి సంత వద్ద ఎస్‌పి ఆదేశాల మేరకు ఈనెల 24న వద్ద సీతంపేట పోలీస్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్టు ఎస్సై జగదీష్‌నాయుడు తెలిపారు. వైద్య సేవలను చుట్టు పక్కల గ్రామ ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.


మెనిఫెస్టో పత్రాలతో ప్రచారం చేస్తున్న జగదీశ్వరి

టిడిపి, జనసేనతో ప్రజలకు భరోసా

ప్రజాశక్తి - కురుపాం

టిడిపి- జనసేన ఉమ్మడి కూటమితోనే రాష్ట్ర భవిష్యత్తు ప్రజల భవిష్యత్తుకు భరోసా ఉంటుందని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలో జి.శివడ, అంటిజోల, దిగువ అంటిజోల, కించాయిగూడ, డేప్పిగూడ, తాటిపాడుగూడ తదితర గిరిజన గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి టిడిపి మేనిఫెస్టో, కరపత్రాలు పంపిణీ చేసి రానున్న ఎన్నికల్లో తెదేపా-జనసేన కూటమిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్ర దేవ్, మండల కన్వీనర్ కెవి కొండయ్య, పార్లమెంట్ ఎస్టీ సెల్ అధ్యక్షులు ఎన్.కృష్ణబాబు, టిడిపి, జనసేన నాయకులు ఎన్.వంశీ, హెచ్.సుబ్బలక్ష్మి, మల్లేష్, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల వేలం

ప్రజాశక్తి -గరుగుబిల్లి

మండలంలో నాటుసారాతో పట్టుబడ్డ వాహనాలను గురువారం స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో పాలకొండ డిఎస్‌పి జివి కృష్ణారావు సమక్షంలో వేలం వేశారు. ఆయా గ్రామాల పరిధిలో నాటుసారా, మద్యం సీసాలను అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాలను సీజ్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్లో ఉంచారు. గరుగుబిల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఐదు వాహనాలు, చినమేరంగి పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు వాహనాలను వేలం వేసినట్టు ఎస్ఐ వై.అమ్మన్నరావు తెలిపారు.

పెంకుటిల్లు దగ్ధం

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలోని మంతిని వీధిలో మంతిని సంతోష్‌కు చెందిన పెంకుటిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గురువారం అగ్ని ప్రమాదానికి గురైంది. బాధితులు అందించిన వివరాలు ప్రకారం సుమారు లక్ష రూపాయల ఆస్తి నష్టం జరిగిందని ప్రమాదం సంభవించినప్పుడు ఇంట్లో ఎవరూ లేకపోవడం పెను ప్రమాదం తప్పిందనీ ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు. స్థానికులు అగ్నిమాపక సిబ్బంది వచ్చే మంటలను అదుపు చేశారు.